కథ

# ఎర్రసంచీ

పి.వి.ప్రభాకరమూర్తి

సోమవారం, బ్యాంకు రద్దీగా ఉంది. శేఖరం డబ్బు అడగడంతో బ్యాంకుకు వచ్చాను. శేఖరం నాకు బావమరిది అవుతాడు. అమ్మాయిని కాలేజీలో జాయిన్ చేయాలి ఓ పాతికవేలు ఉంటే సర్ద మని ఉదయం ఫోను చేశాడు.

బ్యాంకుకు బయలుదేరుతుంటే "ఇదిగో! బ్యాంకుకు వెడుతున్నట్లు న్నారు. బీరువాలో ఎర్రసంచి ఉంది. అది తీసుకువెళ్లండి" అంది తాయారు.

ఉదయం నుండి మా ఆవిడ హుషా రుగా ఉంది. వాళ్లన్నయ్య ఫోను చెయ్యడం, అడిగిన వెంటనే నేను డబ్బు సర్దుతాననడం ఆవిడ హుషారుకి కారణం. బీరువాలోంచి ఎర్రసంచి తీశాను. మా పెళ్లయిన దగ్గర నుంచి డబ్బు విషయంలో ఎర్రసంచి ముఖ్య పాత్ర వహిస్తోంది. డబ్బుతో సంబంధం ఉన్న ఏ పనయినా చేసే ముందు ఎర్రసంచితో వెడితే ఆ పని దిగ్విజయంగా జరుగుతుందని మా నమ్మకం. బ్యాంకు డబ్బు డ్రా చేయడా నికైనా, డిపాజిట్ చేయడానికైనా ఎర్రసంచితో బయలుదేరటం జరుగు తోంది.

క్యాషియర్ టోకెన్ నెంబరు పిలవడంతో కౌంటరు దగ్గరకి వెళ్లి డబ్బు డ్రా చేసి, ఎర్రసంచిలో పెట్టి వెనక్కి తిరిగాను. బ్యాంకు బయట పరాంకు శంగారు కనిపించారు. పరాంకుశంగారు మా నాన్నగారికి మంచి స్నేహితుడు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఏడాది క్రిందట నాన్నగారు పోయారు.

"ఏం నాయనా! బాగున్నావా?" పలకరించారు పరాంకుశంగారు. నవ్వుతూ తలూపాను. పెద్దవార యిపోవటంతో మెట్లు ఎక్కలేక పోతున్నారు. చేయి పట్టుకుని లోపలికి తీసుకువెళ్లి కౌంటరు పక్కగా ఉన్న సోఫాలో కూర్చోబెట్టాను.

"మా అల్లుడికి ఓ వెయ్యి రూపాయలు అవసర మైతే అమ్మాయితో కబురంపాడు అమ్మాయి నిన్న ఉదయం వచ్చి డబ్బు ఇస్తావా! చస్తావా!" అంటూ.

'వయసు ముదిరినా మాటల్లో చలాకీతనం పోలేదు' మనసులో అనుకున్నాను. పరాంకుశం గారు డబ్బు తీసుకునేవరకు ఆయనతో ఉన్నారు.

"పది నిమిషాల్లో మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబె ట్టేసి నేను వెడతాను" అని ముసలాయనతో చెప్పి, మా పక్కింట్లో మేడమీద ఉండే బాబూరావుగా రు బ్యాంకు బయట కనిపించడంతో పలకరించడానికి వెళ్లాను.

నన్ను చూడగానే నవ్వుతూ రెండు చేతులు పట్టు కుని మాట్లాడారు. మనిషన్నవాడు నవ్వకపోతే పాపం అన్నట్లుగా ఆయన ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తూ ఉంటారు. సాయిబాబా భక్తుడు.

"కాలనీలో సాయిబాబా గుడి కట్టి మూడు సంవత్సరాల్లయిన సందర్భంగా మిమ్మల్ని పిలి చాను. మీ ఇంట్లో వాళ్లు వచ్చారు కానీ మీరు రాలేదు" అన్నారు నవ్వుతూనే.

నేను సమాధానం చెప్పేలోగానే "దొంగ, దొంగ" అన్న అరుపులు వినపడి వెనక్కి చూశాను. పరాంకుశంగారు కిందపడి ఉన్నారు. ఆయన చేతిలో సంచి ఎవడో లాక్కుపోయాడు.

"బాబూ! నా సంచీతోపాటు నన్ను పట్టుకోమని ఇచ్చిన నీ ఎర్రసంచి కూడా పట్టుకుపోయాడు" నెత్తి నోరు బాదుకుంటున్నారు.

నేను నోరు తెరచి ఓ పది నిమిషాలు అలాగే ఉండిపోయాను. జనం మూగారు.

"లేడిలా పరిగెత్తుకుపోయాడు, దొంగ వెధవ" అన్నాడో పెద్ద మనిషి.

"వాడికి ఓ చెవి లేదండి" అన్నాడో ప్రత్యక్ష సాక్షి.

ఓ పది నిమిషాలు మౌనం పాటించి పరాంకు శంగారిని ఓదార్చి ఇంటి దారి పట్టాను.

"నా మూలంగా మీ డబ్బు పోయింది కాబట్టి ఆ డబ్బు నేనిస్తాను. మీరు మరోవిధంగా భావించ వద్దు" అని అతికష్టం మీద ముసలాయన్ని ఒప్పిం చాను.

బలవంతంగా అంగీకరించారు పరాంకుశం గారు. రేపు వస్తాను అంటూ ఆయన్ని వాళ్ల ఇంటి దగ్గర దిగబెట్టాను.

ఇంటికి వచ్చాక తాయారుకి విషయం చెప్పాను. "వెధవ డబ్బు పోతే పోయింది. బంగారం లాంటి ఎర్రసంచి పోయింది" అరగంట సేపు లబో దిబోమంది. తాయారుని ఓ పావుగంట సేపు ఓదా ర్చాను. పరాంకుశంగారికి డబ్బు ఇస్తానన్న విషయం మాత్రం చెప్పలేదు.

శేఖరానికి ఫోనుచేసి జరిగింది చెప్పాను. అంతా విన్నాక దొంగల గురించి అరగంట వాయించే శాడు. కాసేపు మౌనం పాటించి సెల్ ఆఫ్ చేశాను.

ఉదయాన్నే వాకింగ్‌కి పార్కుకి బయలుదే రాను. పార్కుకి ఆనుకుని ఉన్న పరాంకుశం గారి ఇంటి ముందు ఇద్దరు ముగ్గురు హడావిడిగా తిరు గుతున్నారు.

"పరాంకుశం గారు ఉన్నారా?" బయటకు వచ్చినతన్ని అడిగాను. "లేరు! నిన్న రాత్రి పోయా రండి" సమాధానం చెబుతూనే ఎవరో తరుముతు న్నట్లుగా వెళ్లిపోయాడు.

నేను ఆశ్చర్యంతో నోరు తెరిచాను. గబగబా లోనికి వెళ్లాను. పెరట్లో ఓ మూలగా ఉంది ఇల్లు. ఓ మాదిరిగా బలంగా ఉన్న మనిషి ఇంటిగోడకి జార బడితే పునాదులతో సహా లేచిపోయేలా ఉంది. బీద రికానికి చిరునామాలా, తాతలనాటి చిల్లులు పడ్డ గొడుగులా ఉంది ఆ ఇల్లు. గుమ్మం దగ్గరే పరాంకు

శంగారిని పడుకోబెట్టారు. పక్కనే భార్య కాబోలు ఏడ్చిఏడ్చి ఇక ఓపిక లేక నీరసంగా కూర్చున్నారు. దగ్గరగా వెళ్లి నమస్కారం పెట్టాను. జీవితంలో పడ్డ బాధలన్నీ పొట్లాం కట్టినట్లుగా ఉంది ముడతలు పడ్డ ఆవిడ ముఖం. బాల్యం నుంచీ తన సొంత ఆస్తిలా నుదుటిమీది బొట్టు జారి కన్నీటిలో కలిసిపోయి, ఎర్రనీళ్లు కళ్లల్లోంచి జారుతున్నాయి. ఏదో చెప్పాల్సింది ఉంది అన్నట్లుగా పరాంకుశంగారి పెదాలు సగం తెరిచి ఉన్నాయి. అప్రయత్నంగా నా కళ్ల వెంట రెండు కన్నీటిచుక్కలు జారాయి.

"నమస్తే సర్! ఆయన మా నాన్నగారండి. మీరు..." అంటూ నసిగాడు ఓ పాతికేళ్లతను, నేను చెప్పాను.

"నన్ను దొంగాడు అంటారు" పేరు విని ఆశ్చర్యపోతున్న నా వైపు చూసి చెప్పటం మొదలుపెట్టాడు. "మా అమ్మకి పిల్లలు పుట్టటం, ఏడాది కూడా బతకకుండా చనిపోవడం జరుగుతూండేది. ఏదో ఒక విచిత్రమైన పేరు పెడితే పిల్లలు బతుకుతారని ఎవరో సాధువు చెప్పాడట. నాకు 'దొంగాడు' అని పేరు పెట్టారండి. నాకు ఉద్యోగం లేదండి, తినడానికి ఏమీ సరిగా ఉండటం లేదండి" అన్నాడు.

ఆ మాటలు అంటున్నప్పుడు అతని కంటికి అడ్డుపడిన కన్నీటిపొర, నా మనస్సుని కడిగేసినట్లయింది.

"కార్యక్రమాలు అన్నీ అయిన తర్వాత ఒకసారి కనిపించు" అని నా సెల్ నెంబర్ అతనికి ఇచ్చాను. ఓ పావుగంట తర్వాత శవాన్ని తీసుకెళ్లారు. ఓ పది నిమిషాలుండి ఇంటికి నడిచాను భారంగా.

మేడమీద నిలబడి అటూ ఇటూ తిరుగుతున్నాను. వీధి చివర్న ఉన్న వెంకటేశ్వరస్వామి గుడి లోంచి భగవద్గీత వినిపిస్తోంది. గుడి గోపురం చుట్టూ పావురాలు, ప్రదక్షిణాలు చేస్తూ ఉన్నాయి. దూరంగా దొంగాడు ఇంటి వైపు వస్తూ కనిపించాడు. ఉదయం ఫోను చేసి అడ్రస్ అడిగాడు. అతని గురించే మేడ మీద నిలబడ్డాను దూరం నుండే నన్ను చూసినట్లున్నాడు. ఇంటి దగ్గరకు రాగానే పైకి చూశాడు. నేను పైకి రమ్మని సైగ చేశాను. కొత్తగా కాలేజీకి వెళ్లే స్టూడెంట్‌లా భయంగా పైకి వచ్చి దూరంగా నిలబడ్డాడు.

"నీ ఉద్యోగం గురించి మా ఆఫీసర్‌తో మాట్లాడాను. ఆయన ఈ రోజు ఉదయం ఆఫీసు పనిమీద హైదరాబాద్ వెళ్లాడు. వచ్చిన తర్వాత తప్పకుండా నీ విషయం చూస్తానన్నాడు" చెప్పాను నెమ్మదిగా. అతను సరేనన్నాడు.

"నీ బయోడేటా ఇస్తే ఆఫీసరు వచ్చినప్పుడు ఇస్తాను" అన్నాను. ఇంతలో తాయారు కాఫీ కప్పు





లతో పైకి వచ్చింది.


"పరాంకుశంగారి అబ్బాయా?" అడిగింది నా వైపు చూసి. అవును అన్నట్లుగా తలూపాను.


"నీ పేరేమిటి?" అడిగింది కాఫీ కప్పు అందిస్తూ.

"దొంగాడు" చెప్పాడు.

నా వైపు ఆశ్చర్యంగా చూసింది తాయారు. నేను ఏమీ మాట్లాడలేదు. కాసేపు నిలబడి కాఫీకప్పులతో కిందకి వెళ్లిపోయింది.

నేను చెప్పదలచుకున్నది ఆలస్యం చేయకుండా చెప్పటం మొదలు పెట్టాను. "తినడానికి కూడా కష్టంగా ఉందన్నావు కాబట్టి నీకు ఉద్యోగం వచ్చేలా చూస్తాను. ఇదిగో ఈ డబ్బు ఉంచు" అంటూ రెండు ఐదు వందల నోట్లు అతని చేతిలో పెట్టాను. అతను వద్దంటూనే జేబులో పెట్టుకున్నాడు. రెండు నిమిషాల తర్వాత "బయోడేటా సాయంత్రం ఇస్తాను" అన్నాడు. నేను సరే అన్నాను.



చెప్పినట్లుగానే సాయంత్రం ఆరున్నరకి 'దొంగాడు' వచ్చాడు. చేతిలో ఎర్రసంచితో ప్రత్యక్షమయ్యాడు. బ్యాంకు దగ్గర పోయిన ఎర్రసంచి ఇతని దగ్గరకి ఎలా వచ్చిందా అని నేను ఆశ్చర్యపోయాను. సంచి మధ్యలో తాయారు మా పెళ్లయిన కొత్తల్లో కుట్టిన పువ్వుల డిజైను, పసుపు రంగుతో కుట్టిన తన పేరూ కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నాయి. అతను సంచి తెరచి బయోడేటా నా చేతిలో పెట్టాడు.

"ఎర్రసంచి బావుంది" అన్నాను నెమ్మదిగా.

"మా మామ్మ పెళ్లికి ఎవరో బహుమతిగా ఈ సంచి ఇచ్చారట. అప్పటి నుండి ఇది మా ఇంటిలోనే ఉంది. మీకు నచ్చితే తీసుకోండి" చేతిలో పెట్టబోయాడు.

ఎర్రసంచి కింద పడింది. "అరెరే..." అంటూ అతను వంగి తీయబోయాడు. ఇంతలో అతను పెట్టుకున్న టోపీ జారి కింద పడింది. అతను టోపీ చేతితో పట్టుకుని, సంచి తీసుకోమన్నట్లుగా నాకు అందించాడు. నేను అతన్ని పరీక్షగా చూశాను. అతనికి ఒక చెవి లేదు. బ్యాంకు దగ్గర దొంగతనం చేసిన వాడికి ఒక చెవి లేదు అని ప్రత్యక్ష సాక్షి అనడం నాడు వెంటనే గుర్తొచ్చింది. అంటే తన తండ్రి దగ్గర డబ్బు కొట్టేసి పారిపోయింది వీడేనన్నమాట. ఒక క్షణం నా మెదడు పనిచేయడం మానేసింది. లోపలికి వచ్చి తాయారు చేతిలో ఎర్రసంచి పెట్టి విషయం చెప్పాను. కళ్లు పెద్దవి చేస్తూ అంతా విని కోపంతో బయటకు వచ్చింది తాయారు. మా మాటలు విన్నట్లున్నాడు నెమ్మదిగా జారుకున్నాడు దొంగాడు. పరాంకుశంగారి శవం ఏదో చెప్పాలనుకున్నట్టుగా నోరు తెరిచింది.. వీడి చేతివాటం గురించే అయి ఉంటుంది. బయోడేటా చింపి చెత్త బుట్టలో పడేశాను.

★

## పెళ్లంటే భయం!

గతంలో ఫ్యాషన్ షోలలో పాల్గొని మిస్సిండియా కిరీటాన్ని సొంతం చేసుకున్న సినీతార నేహాధుపియా ఇటీవల ఓ ఫ్యాషన్ షోకి వచ్చి- తనకిలాంటి షోలకొచ్చినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది అంటూ తెగ సంబరపడిపోయింది. బానే వుందికాని, మీ పెళ్లెప్పుడు? అని అడిగాడో ఆసామీ. దానికామె ఉలిక్కిపడి- 'నాకింకా పెళ్లిచేసుకునే వయసురాలేదు. చాలా టైముంది. అయినా ఎందుకో నాకు పెళ్లి వూసెత్తితేనే ఏదో భయం కలుగుతుంది' అంటూ సెలవిచ్చింది. ఎందుకో మరి!